ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY 5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 30 మే 2025

అయ్యో..!



ఊరి దారిలోకి పొయ్యేకి లేకుండా పెద్ద రోడ్డు మధ్యలో ఇలా అడ్డంగా ఇనుప రేకులు బిగించా రేంటి..?

శింగనమల, మే 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం, అమరావతి మధ్య 544డి నంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మరవకొమ్మ వద్ద శింగనమల రోడ్డులోకి వెళ్లే అవకాశం లేకుండా హైవే మధ్యలో డివైడర్ ఏర్పాటు చేశారు. అర కిలోమీటరు తర్వాత యూటర్న్ ఏర్పాటు చేశారు. దీంతో తాడిపత్రి నుంచి వచ్చి బస్సు దిగిన వారు.. రోడ్డు దాటుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అందుకు నిదర్శనమే ఈ వృద్ధుల తిప్పలు. తాడిపత్రి నుంచి వచ్చిన వృద్ధులు రోడ్డు దాటడానికి డివైడర్ నానా అవస్థలు పడ్డారు.



● ఇగో.. మన బోటి ముసలోళ్ల కష్టాలు ఎవరికి కావల్లా..? దిగులు పడతా ఉంటే ఈడే ఉండిపోతాం. చేతులకు మట్టవుతుంది, గుడ్డలు మాసిపోతాయనుకోకుండా కింది నుంచి దూరిపోదాం. పద.. పద.. నేను కూడా వత్తా.
● జాగ్రత్తే.. లారీ వత్తాండాది. ఇగో.. సామీ.. మన పాణాలు పోతే.. రోడ్డేసినోళ్లకు ఏం నష్టం?



● అయ్యయ్యో.. జాగ్రత్త సామీ.. యాడన్నా.. ఎముకో.. గిముకో.. ఇరిగేనయ్యో.. ముసలి ముప్పున శానా ఇబ్బంది పడతావు.



● ఉండుండు.. పెద్దాయనా.. చెయ్యిబడతాం. రేకు కింది నుంచి యాడొత్తారు, మీ చేతనైతాదా..?
● ఏం చేత్తావు నాయనా.. అంత దూరంపొయ్యి తిరుక్కుని రాలేక, ఈ అగచాట్లు పడతాండాం. మీకుండే పెద్ద బుద్ధి రోడ్డేసినోళ్లకి ఉండుంటే.. మాకు ఈ తిప్పలు తప్పేవి.

సందట్లో సడేమియా..!

బదిలీలు, ప్రమోషన్ల వేళ ఏఎస్ఓ పోస్టు భర్తీ
ఆగమేఘాల మీద పోస్టింగ్‌పై విమర్శలు
డీఈఓ ఆఫీస్ ఏఎస్ఓగా శ్రీనివాసులు
ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ ద్వారా డీఈఓ, ఆర్‌జేడీపై ఒత్తిడి

7

నేటి నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్



7

వీడుతున్న మిస్టరీ

గుర్తుతెలియని శవానికి ఏడాది తర్వాత రీపోస్టుమార్టం

గందరగోళంగా మొదలై..!

ప్రశాంతంగా ముగిసిన కౌన్సెలింగ్
145 హెచ్ఎం పోస్టుల భర్తీ
వెలుతురు లేక రాత్రి అవస్థలు





హెచ్ఎంల కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు



సెల్‌ఫోన్ వెలుతురులో అగచాట్లు

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల ప్రక్రియ గురువారం గందరగోళంగా మొదలై ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని జడ్పీ, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించి.. హెచ్ఎం పోస్టులను భర్తీ చేశారు. రెండు రోజుల కిందట సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించగా, గురువారం ప్లేస్, పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. 145 పోస్టులకు 1:3 చొప్పున కౌన్సెలింగ్‌కు పిలిచారు. మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించాల్సి ఉండగా... రోస్టర్ ఖాళీలపై వివాదం నేపథ్యంలో ఆలస్యమైంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి టీచర్లకు ఎదురుచూపులు తప్పలేదు. ఎట్టకేలకు రాత్రి 7 గంటల నుంచి హడావుడిగా కౌన్సెలింగ్ ప్రారంభించారు.

వాగ్వాదం.. పోలీసుల ఎంట్రీ

ఎస్సీ, ఎస్టీ టీచర్లకు ప్రమోషన్లలో అన్యాయం చేస్తే సహించేది లేదంటూ కౌన్సెలింగ్ సమయంలో కొందరు సంఘాల నాయకులు, హెచ్ఎంలు, ఎంఈఓలు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా అడిక్వసీ (మిగతా 7లో..)

సత్యం అరెస్టు..!

విదేశీయుడిని మోసగించినట్లు కేసు

20న కాదట.. 28న అరెస్టు చేశారట..!
సత్యనారాయణరాజు ఆస్తులు ట్రాన్స్‌ఫర్
అర్విన్ భార్య సుమతి పేరిట రిజిస్ట్రేషన్
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ముసుగేసి తీసుకెళ్లారా..?
తమకు తెలియదంటున్న పోలీసుల మాటల్లో నిజమెంత..?



నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి, మే 29(ఆంధ్రజ్యోతి): విదేశీయుడిని మోసగించాడన్న ఆరోపణలపై పుట్టపర్తి గోకులానికి చెందిన రత్నాకరం సత్యనారాయణ రాజును పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 20న పోలీసులు తీసుకెళ్లారని కుటుంబ సభ్యులు అంటున్నా.. అతన్ని ఈ నెల 28న అరెస్టు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ అరెస్టు చూపకమునుపు తెరవెనుక పెద్ద తంతంగమే నడిచినట్లు స్పష్టమౌతోంది. రత్నాకరం సత్యనారాయణరాజు పేరిట పుట్టపర్తి, ధర్మవరం, కుణుతూరు వద్ద భూములు, స్థలాలు ఉన్నాయి. ఇవి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో అర్విన్ ప్రిన్సెస్ మహీంద్రకర్ భార్య తలారి సుమతి పేరిటి రిజిస్టర్ అయ్యాయి. ధర్మవరం మండలం కుణుతూరు సర్వే నంబర్ 344-1, 344-1ఏలో 19 సెంట్లు, సర్వే నంబరు 511-2లో 1.45 ఎకరాలు ఆమె పేరిట రిజిస్టర్ (డ్యాంకుమెంట్ నంబర్ 1563) అయ్యాయి. పుట్టపర్తి ఆసుపత్రి వద్ద సర్వే నంబర్ 509-లో 67 సెంట్ల స్థలాన్ని కూడా డ్యాంకుమెంట్ నంబర్ 1564 కింద సుమతి పేరిట రిజిస్టర్ చేయించారు. ఇవన్నీ రత్నాకరం సత్యనారాయణరాజు నుంచి అర్విన్ భార్య పేరిట మారిపోయాయి. ఇవే కాకుండా మరో ఐదు చోట్ల భూములు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. ఈ వివాదం (మిగతా 7లో...)

ప్రమోషన్లు ఇచ్చే వరకూ పోరాటం

ఎస్ఏ ఇంగ్లిష్ టీచర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆగిన ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇచ్చే వరకూ పోరాటం ఆగదని ఆశావహ టీచర్లు, సంఘాల నాయకులు హెచ్చరించారు. బదిలీల ప్రక్రియ జరుగుతున్న శారదా స్కూల్‌లో గురువారం టెంట్ వేసి నిరసన తెలిపారు. 2023లో ఇతర జిల్లాల్లో ప్రమోషన్లు ఇస్తే.. ఇక్కడ మాత్రం ఆగిపోయాయని అన్నారు. వందలాది మంది ఉపాధ్యాయులు ప్రమోషన్లు, సర్వీసు నష్టపోయారని అన్నారు. గతంలో 230 ఖాళీలు ఉంటే.. ఇప్పుడు పదుల సంఖ్యలో చూపుతున్నారని అన్నారు. బాధిత టీచర్ల సమస్యను దృష్టిలో ఉంచుకుని 230 ఖాళీలు చూపాలని, వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు ధర్నా శిబిరం వద్దకు వచ్చి మాట్లాడారు. సమస్యను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, లెటర్ పంపించామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యుడు, రమణారెడ్డి, భుక్యా జయరాం నాయక్, సిరాజుద్దీన్, వెంకటేష్, బండారు శంకర్, వెంకటరత్నం, శంకరమూర్తి, హరికృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వాణిశ్రీ, త్రివేణి, విజయశ్రీ, లక్ష్మీదేవి, కేశవరెడ్డి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ముందుగా
మేల్కొండి..!

● త్వరలో విద్యా సంవత్సరం ఆరంభం ● అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి ● హడావుడి కన్నా ముందస్తే మేలు అంటున్న అధికారులు (6లో...)

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరిక



అనంతపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశువు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ ఈబీ దేవి గురువారం హెచ్చరించారు. స్కానింగ్‌కు వచ్చిన గర్భిణుల నుంచి వైద్యుల రెఫరెన్స్ రసీదును తీసుకుని ఫైల్ చేసుకోవాలని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. లింగ నిర్ధారణ కోసం ఆర్ఎంపీలు గర్భిణులను స్కానింగ్‌కు పంపుతున్నారని, పద్ధతి మానుకోవాలని హెచ్చరించారు. ఆర్ఎంపీలు పంపిన గర్భిణులకు స్కానింగ్ చేయొద్దని సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రులో నిరంతరం చేస్తారని అన్నారు. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 08554-228234 నంబరుకు సమాచారం ఇవ్వాలని డీఎంహెచ్ఓ కోరారు.

ఖాళీలతో కబడ్డీ...!

బదిలీల వేళ జడ్పీలో అక్రమాలు..?
ఎంపీడీఓ ఖాళీలు చూపని అధికారులు
కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించని సీఈఓ
అక్రమాలు పునరావృతమౌతాయని అనుమానం



నోటీస్ బోర్డులో ఖాళీలు చూస్తున్న ఉద్యోగులు

అనంతపురం విద్య, మే 29 (ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీల ముందు ఖాళీలను కబడ్డీ ఆడేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న వేకెన్సీలను పారదర్శకంగా చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కొన్ని ఖాళీలను చూపకుండా, రేట్లు కట్టి అడ్డగోలుగా అమ్మేయాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నెల 27వ ఉద్యోగుల నుంచి బదిలీలకు దరఖాస్తులు స్వీకరించారు. 231 మంది దరఖాస్తు చేశారు. వాళ్లకు కౌన్సెలింగ్ ఎప్పుడన్నది ఇప్పటి వరకూ సీఈఓ ప్రకటించలేదు. ఇతర జిల్లాల్లో షెడ్యూల్ ఇచ్చారు. కానీ ఇక్కడ మాత్రం (మిగతా 7లో..)

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



యాడికి తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు

యాడికి/పుట్లూరు మే 29 (ఆంధ్రజ్యోతి): నిట్టూరు, కడవకల్లు సమీపంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను కర్నూలు సీఐడీ అధికారులు గురువారం పరిశీలించారు. అనంతరం యాడికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. నిట్టూరులో 63.43 ఎకరాల అగ్రిగోల్డ్ భూములున్నాయని, కోర్టు ఉత్తర్వుల మేరకు భవిష్యత్తులో వేలం వేస్తామని తహసీల్దారు అన్నారు. ఆ భూములపై సమగ్ర సమాచారం కోసం సీఐడీ అధికారులు వచ్చారని తెలిపారు.

మొక్కలు ముక్కలు..!

కొనేవారు లేక పాడైపోతున్న మొక్కలు

నష్టాలతో పంట సాగుకు ముందుకు రాని రైతులు
● నారును నర్సరీల్లోనే వదిలేస్తున్న నిర్వాహకులు
● కొక్కంటి క్రాస్‌లోనే రూ.రెండుకోట్లు నష్టం
● నష్టాల ఊబిలో నర్సరీ యజమానులు



కొక్కంటిక్రాస్ నర్సరీలో వదిలేసిన పైరు

తనకల్లు, మే29(ఆంధ్రజ్యోతి): కొనేవారు లేకపోవడంతో నర్సరీల్లో సాగు చేసిన మొక్కలను వదిలేయాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లక్షల రూపాయల నష్టం వస్తోందని వాపోతున్నారు. ఇటీవల కాలంలో నర్సరీల్లో పెంచిన మొక్కలనే తెచ్చి సాగు చేసే రైతుల సంఖ్య బాగా పెరిగింది. దీంతో చాలామంది నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని ఒక కొక్కంటిక్రాస్ సమీపంలోనే 70కిపైగా నర్సరీలు ఏర్పాటు చేశారు.

లీజు భూముల్లో...

నర్సరీల నిర్వాహకులకు చాలామందికి సొంత భూమి లేకపోవడంతో యజమానుల నుంచి లీజుకు తీసుకుంటున్నారు. వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఇబ్బందులు లేకుండా సాగేది. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో వర్షాలు పడినప్పుడు నర్సరీల్లోని మొక్కల కోసం రైతులు పోటీ పడేవారు. అయితే ఈ ఏడాది మే నెల ప్రారంభంలోనే అధిక వర్షాలు పడ్డాయి. నేటికి పడుతూనే ఉన్నాయి. అయితే నర్సరీల్లోని మొక్కలను కొనుగోలు చేయడానికి రైతులెవరూ ముందుకు రావడం లేదు. దీంతో నర్సరీల్లో పెంచిన(సాగు) పైర్లను అలాగే వదిలేయాల్సి వస్తోంది. ఈకారణంగా కొక్కంటి క్రాస్‌లోనే ఈయేడాది ఖరీఫ్‌లో టమోట, వంగ, మిరప మొక్కల్లో రూ.రెండు కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు నర్సరీ యజమానులు చెబుతున్నారు.

227 మందికి లైసెన్సులు

ఉద్యాన అధికారుల గణాంకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 227మంది నర్సరీ యజమానులు ఉద్యాన శాఖ ద్వారా లైసెన్సులు పొందారు. ఎంతోమంది లైసెన్సులు (మిగతా 6లో..)

మరో రోజు..!

సూపర్ స్పెషాలిటీలో ఓపీ పెంపు
ఒక్కో విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులు సేవలు
2 నుంచి అమలులోకి.. 6

విత్తనాలు, ఎరువుల
కొరత రాకూడదు

అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు
(వివరాలు 6వ పేజీలో..)

మెడలో టవాలు.. రబ్బరు చెప్పులు..

రోగి సంబంధికుడిలా
ఆస్పత్రికి కలెక్టర్

అరగంటపాటు తనిఖీ
రోగులతో వైద్యంపై ఆరా
పలు లోపాలపై చర్యలకు డీసీహెచ్ఎస్‌కు ఆదేశాలు



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

గుంతకల్లు/టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): మూతికి మాస్క్, మెడలో టవాలు, కాళ్లకు రబ్బరు చెప్పులు వేసుకుని, బుధవారం రాత్రి గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి ఓ వ్యక్తి వచ్చారు. ఆస్పత్రి అంతా కలియతిరిగారు. సెక్యూరిటీ, రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరాతీశారు. వార్డులన్నీ పరిశీలించారు. అరగంట తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన ఎవరన్నది ఆ రాత్రి ఎవరూ గుర్తించలేదు. మరుసటి రోజుగానీ తెలియలేదని ఆయన స్వయానా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అని. ఎవరూ గుర్తుపట్టని వేషధారణతో ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. పలు నిర్వహణాలోపాలను కలెక్టర్ గుర్తించి, తగిన విధంగా చర్యలు తీసుకోవాలంటూ డీసీహెచ్ఎస్ రవికుమార్‌ను ఆదేశించారు. రాత్రి 10.30 గంటల సమయంలో రోగి సంబంధీకుడినంటూ మాస్కు ధరించిన కలెక్టర్ గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి వచ్చారు. క్యాజువాలిటీలో డాక్టర్ ఉన్నారా, లేరా? అని పరిశీలించారు. లేబర్ వార్డుకెళ్లారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుల పనితీరును గమనించారు. ఆస్పత్రిలో నిలిపిన ప్రైవేటు అంబులెన్స్ ఉండగా, దాని నిర్వాహకులతో మాట కలిపి వివరాలను తెలుసుకున్నారు. రోగిని అనంతపురం తీసుకెళ్లడానికి అంబులెన్స్‌కు ఎంతవుతుందని అడగ్గా.. రూ.5,500 తీసుకుంటామని వారు తెలిపినట్లు సమాచారం. ఆక్సిజన్ లేని అంబులెన్సుకు ఎంత అవుతుందని కలెక్టర్ ఆరాతీశారు. ఆక్సిజన్ ఉన్నా-లేకపోయినా అంతే అవుతుందని సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఆస్పత్రిలో పలు అంశాలను తనిఖీచేసిన కలెక్టర్ అరగంట తర్వాత వెనుదిరిగి వెళ్లిపోయారు. గురువారం సూపరింటెండెంట్, ఇతర అధికారులను అనంతపురానికి పిలిపించి, ఆస్పత్రిలో తాను గమనించిన లోపాలపై ప్రశ్నించినట్లు సమాచారం. సెక్యూరిటీ గార్డులు ప్రవేశ ద్వారం వద్ద కనిపించలేదనీ, ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ సరిగాలేదనీ, మరుగుదొడ్లు హైజీనిక్‌గా లేవని నిలదీసినట్లు తెలిసింది. ప్రైవేటు అంబులెన్స్‌లను ఆస్పత్రిలోకి ఎందుకు అనుమతించారనీ, వారు అధిక మొత్తాలను చార్జ్ చేస్తున్నారని మండిపడ్డారని సమాచారం. ఆస్పత్రి సిబ్బంది.. రోగులను ప్రైవేటు నర్సింగ్ హోంలకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారనీ, ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌ను ఎందుకు రన్నింగ్ కండిషన్‌లో ఉంచలేదంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది. ఆయా లోపాలపై చర్యలు తీసుకోవాలంటూ డీసీహెచ్ఎస్‌కు కలెక్టర్ లెటర్ పంపారు.


'మహాసైకిల్'


సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక



సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు







మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం







మొక్కలు ముక్కలు!


కొక్కంటిక్రాస్ నర్సరీ వద్ద బయట పడేసిన నారు

(5వ పేజీ తరువాయి)

లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్నారు. లైసెన్సులు పొందినవారిలో 56మంది మాత్రమే ఇప్పటివరకు రెన్యువల్ చేసుకున్నారు. ఈ ఏడాది రైతులు సాగుచేసిన వంగ, టమాట, మిరప, బీట్రూట్, క్యారెట్, బూడిద గుమ్మడి, దోస, బొప్పాయి తదితర పంటలు ధరలు లేక పొలాల్లోనే వది లేయాల్సి వచ్చింది. దీంతో వర్షాలు అనుకూలంగా కురుస్తున్నా, భూములు సిద్ధంగా ఉన్నా రైతులు మాత్రం పంటలు సాగుచేయడా నికి ముందుకు రావడంలేదు. ఇప్పటికే 20లక్షలకుపైగా మొక్కలు నాటాల్సి ఉండగా, ఒక్క మొక్కకూడా నాటలేదు. టమోటాకు ధర ఉంటే, మండలంలోనే 50లక్షలకు పైగా మొక్కలు అమ్ముడుపోయేవి. ధరలు లేకపోవడం వల్ల టమోటా మొక్కలను కొనుగోలు చేయడానికి రైతులు ముందుకు రావడం లేదు. కొంతమంది రైతులు ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మొక్కలు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ నేప థ్యంలో వందలాది నర్సరీల్లో పెంచిన లక్షలాది మొక్కలను కొనేవారులేక వదిలివేయాల్సి వచ్చింది. ప్రభుత్వం నర్సరీల నిర్వాహకులను ఆదుకోవా లని కోరుతున్నారు.

అడిగేనాథుడే లేడు: టి.రాజా, నర్సరీ యజమాని, కొక్కంటిక్రాస్



ఈఏడాది ఖరీఫ్‌లో టమోటా, మిరప, వంగ రెండు లక్షలకుపైగా మొక్కలను మే నెలలో విక్ర యించడానికి నర్సరీలో పెంపకం చేపట్టాం. వీటి కోసం భూమిని లీజుకు తీసుకుని నర్సరీ ఏర్పాటు చేసి, మొక్కల పెంపకం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశాం. మొక్కలు నాటే సమయం మించిపోతున్నా అడిగేనాథుడు లేక బయట పారవేయాల్సి వస్తోంది. రైతులకు ఏ విధమైన మొక్కలు అవసరమవు తాయో తెలుసుకుని ఆ రకాలనే పెంచుతాం. రైతులు వాటిని కొను గోలు చేయకపోతే మేము వదిలేయాల్సి వస్తోంది. 25నుంచి 30రోజుల లోపు విక్రయించకపోతే ఎంత నారున్నా బయటపడేయాల్సిందే.

లీజు కూడా చెల్లించలేకున్నాం



భూములు లీజులకు తీసుకుని రూ.వేలాదిగా ఖర్చు చేసి, నర్సరీలు ఏర్పాటు చేసి, మొక్కల పెంపకం చేపట్టాం. నర్సరీలు ఎక్కువ కావడంతో పోటీ పెరిగింది. రైతులకు నమ్మకమున్న చోటే మొక్కలు కొనుగోలు చేస్తారు. రైతుల మీద నమ్మ కంతో వారు కోరిన రకాలనే సాగు చేస్తాం. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తున్నా, సాగు చేయాల్సిన సమయం ఆసన్నమైనా, రైతులు మొక్కలు కొనడానికి ముందుకు రావడం లేదు. సాగు చేసిన పంటలకు ధర లేని కారణంగా నే మొక్కలు కొనడానికి ముందుకు రాలేదు. మా నర్సరీలో ఐదులక్షల టమోటా మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. సమయం దాటిపోతే బయట పడేయాల్సిందే. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకునే మాదిరిగా నర్సరీ యజమానులను ఆదుకోవాలని కోరారు.

- గంగాధర్, నర్సరీ యజమాని, కొక్కంటిక్రాస్

ముందుగా మేల్కోండి..!

త్వరలో విద్యా సంవత్సరం ఆరంభం
అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి
హడావుడి కన్నా ముందస్తే మేలు అంటున్న అధికారులు

చిలమత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేలోపు విద్యా ర్థులు వారి ఉన్నత విద్యా ప్రవేశానికి అవసర మైన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుంటే మంచిదని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచిస్తున్నారు. సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం జరిగితే విద్యా ర్థులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. అందుకే అవసరమైన సర్టిఫికెట్ల కోసం ముందుగానే దరఖాస్తు చేసుకుంటే మేలని చెబుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఎంసీఏ ఇలా ఏ కోర్సులో ప్రవేశానికైనా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు సర్టిఫికెట్లు అవసరమవుతాయి. కుల, ఆదాయ, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి ధ్రువీక రణ పత్రాలు అవసరం ఉంటాయి. ఇంటర్మీడి యేట్, డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు ముందుగానే పత్రాలను సిద్ధం చేసుకోవడం వల్ల ఒత్తిడి లేకుండా నూతన కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంటుంది. అవసరమైన ధ్రువపత్రాల కోసం సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకో వాలని సూచిస్తున్నారు.


చిలమత్తూరు సచివాలయం

అవసరమైన సర్టిఫికెట్లు ఇవే..

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఐటిఐ వంటి కోర్సుల్లో ప్రవేశానికి కొందరు విద్యా ర్థులకు కులం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ సర్టిఫికెట్లు, ఆదాయం వంటి ధ్రువపత్రాలు అవసరం అవు తాయి. వీటిని పొందాలంటే ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన జిరాక్సు పత్రాలను జత జేసి సచివాలయాల్లో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన పత్రా లను సంబంధిత వార్డు, గ్రామ వీఆర్వోలు పరిశీ లించి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అంది స్తారు. ఆర్‌ఐ పరిశీలన పూర్తయ్యాక తహసీల్దార్ లాగిన్‌కు వెళుతుంది. తహసీల్దార్ లాగిన్‌లో పరిశీలన చేసి డిజిటల్ సైన్ చేస్తారు. అనం తరం ధ్రువపత్రాలు మంజూరైన సమాచారం మనం ఇచ్చిన మొబైల్‌కు సమాచారం వస్తుంది. తదుపరి మనం దరఖాస్తు చేసుకున్న సచివాల యాలు, మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లి పత్రాలను పొందవచ్చు.

అత్యవసరమైనపుడు నిబంధనలు ముందుకు..

సాధారణంగా మండల, గ్రామ స్థాయిలో ధ్రువీ కరణ పత్రాలు కావాల్సినప్పుడు కొందరు అధికా రులు పని ఒత్తిడో మరే ఇతర కారణంతోనో పత్రాల మంజూరులో జాప్యం చేయడానికి నిబంధనలు ముందుకు తెస్తారు. నిబంధనల ప్రకారం ఆదాయ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడానికి పది రోజుల సమయం ఉంటుంది. కుల, ఆదాయ, నివాసం మూడు కలిగిన ధ్రువ పత్రానికైతే 30 రోజుల వ్యవధి ఉంటుంది. తొందరగా సర్టిఫికెట్ అవసరమని ఒత్తిడి తెస్తే అధికారులు సిటిజన్ చార్ట్‌లో ఉన్న నిబంధనలు ముందుకు తెస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా దరఖాస్తు చేసుకోవడం వలన అధికారులు కూడా నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక తప్పదు.

ఇబ్బందులు ఉంటాయి



అవసరమైన సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే మీసేవ, సచివాలయాల్లో దరఖాస్తు చేసు కుంటే మంచిది. పాఠశాలలు, కళాశాలలు ప్రారం భమైనప్పుడు ఒకే సమయంలో వేలమంది విద్యా ర్థులు ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకుం టారు. దాంతో వాటిని పరిశీలించడానికి ఇబ్బందులు ఎదురవుతాయి. ఒకేసారి వేల సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్లో అప్‌లోడ్ కావడంతో సర్వర్ సమస్య కూడా తలెత్తవచ్చు. ముందుగా దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తుల పరిశీలనకు కూడా అధికారులకు అవకాశం ఉంటుంది. దీనిని గుర్తుంచుకొని కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఇప్పటి నుంచే దర ఖాస్తు చేసుకుంటే మంచిది. - జగన్నాథం, డీటీ, చిలమత్తూరు

టెన్షన్ ఉండదు



త్వరలో విద్యా సంవత్సరం మొదలవుతోంది. తల్లిదండ్రులు పిల్లలకు సంబంధించిన నివాసం, కులం వంటి ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలి. ఇటీవల పదోతరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు ప్రణాళికలు సిద్ధం చేసుకుం టున్నారు. ఈ తరుణంలో వారికి అన్ని రకాలు సర్టిఫికెట్లు చాలా అవ సరం ఉంటుంది. అందుకోసం విద్యార్థులు సర్టిఫికెట్లు కోసం ముందు గానే దరఖాస్తు చేసుకోవడం మంచిది. సకాలంలో సర్టిఫికెట్లు అందితే కళాశాలలకు వెళ్లే విద్యార్థులు హడావుడి పడాల్సిన పని ఉండదు.

- సల్మాన్ రాజ్,
ఎంఈఓ, చిలమత్తూరు

ఆస్పత్రుల్లో భోజన సరఫరాకు టెండర్లు

● 6 వరకు గడువు ● డీసీహెచ్ఎస్ రవికుమార్ వెల్లడి

అనంతపురం టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యవిధాన పరిషత్ ప రిధిలోని ప్రభుత్వాస్పత్రుల్లో రోగులు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ గురువారం తెలిపారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో హిందూపురం (జిల్లా ఆస్పత్రి), తాడిపత్రి, గుంతకల్లు, మడకశిర, కదిరి, ధర్మవరం ప్రాంతీ య ఆస్పత్రులు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి, పెనుకొండ, కొనకొండ్ల, శింగనమల, కణేకల్లు, పామిడి, చెన్నేకొత్తపల్లి, తనకల్లు, కొత్తచెరువు,గోరం ట్ల, నల్లమాడ, రొళ్ల (సామాజిక ఆరోగ్యకేంద్రా(సీహెచ్‌సీలు)ల్లో భోజన సరఫరాకు టెండర్లు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు జిల్లా ఆస్పత్రికి రూ.3వేలు, ప్రాంతీయ ఆస్పత్రులకు రూ.2వేలు, సామాజిక ఆరోగ్యకేంద్రా లకు రూ.1000 చొప్పున డీడీ చెల్లించి, దరఖాస్తుకు కలిపి ఇవ్వాల్సి ఉంటుం దన్నారు. జూన్ 6వతేదీలోగా దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

133 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీ

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో భాగంగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు గురువారం ఉదయం జారీ అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 133 మంది బదిలీ అయ్యారు. జోన్-4 కడప ఆర్జేడీ శామ్యూల్ పేరుతో ఉత్తర్వులు వెలువ డ్డాయి. ఇటీవల జిల్లాలో 191 మంది ప్రధానోపాధ్యాయ బదిలీలకు దర కాస్తు చేసుకున్నారు. 28 మంది తప్పనిసరి, 163 మంది రిక్వెస్టు కింద దరఖాస్తు చేశారు. స్ర్కూటినీ తర్వాత వారికి ఉదయం నుంచే బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 191 మందిలో 133 మందికి స్థానచలనం కల్పించారు. 58 మందికి అవకాశం దక్కలేదు.

మరో రోజు..!

సూపర్ స్పెషాలిటీలో ఓపీ పెంపు
ఒక్కో విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులు సేవలు
2 నుంచి అమలులోకి..

అనంతపురం టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదానగర్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇకపై మూడు రోజులపాటు రోగులకు ఓపీ సేవలు అందించనున్నట్లు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమీక్షించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఒక్కో వైద్యవిభాగం వారంలో రెండ్రోజులు మాత్రమే రోగులకు ఓపీ సేవలు అందిస్తోందన్నారు. మరోరోజు అదనంగా ఓపీ సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. ఈలెక్కన వారంలో మూడురోజులు ఆయా వైద్య విభాగాలు ఓపీ సేవలు అందిస్తాయన్నారు. జూన్ రెండో తేదీ నుంచి అమలు చేస్తామన్నారు.

కొత్త షెడ్యూల్ మేరకు ఓపీ సేవలు ఇలా..

వైద్య విభాగాలు	ఓపీ నిర్వహణ రోజులు
న్యూరోసర్జరీ, గ్యాస్ట్రో, సీటీవీఎస్	సోమ, గురు, శనివారం
కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ	మంగళ, బుధ, శనివారం
నెఫ్రాలజీ, ఎండోక్రినాలజీ, పీడియాట్రిక్ సర్జరీ	సోమ, బుధ, శనివారం

విత్తనాలు, ఎరువుల కొరత రాకూడదు

అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో విత్త నాలు, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవ సాయ, అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని దయ్యాలకుంటపల్లి వద్దనున్న వెంక టాపురం జడ్పీ పాఠశాలలో ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్, మార్కెఫెడ్ అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా మండలాలకు అవ సరమైన మేర విత్తనం, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు నాణ్యతలేకపోతే వెనక్కివ్వాలని రైతులుకు సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. రైతు సేవాకేంద్రాల్లో 100శాతం క్యూఆర్ కోడ్ ద్వారా నగుదు రైతులు చెల్లించే విధంగా చూడాలన్నారు. విత్తన శుద్ధిని వేగవంతం చేయా లని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ, ఏపీ సీడ్స్ డీఎం సుబ్బయ్య, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, ఏఓ శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): విత్తన వేరుశనగ కావాల్సిన రైతుల పేర్లను జిల్లాలోని రైతు సేవాకేంద్రాల్లో శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకుంటామని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 50,592 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కే-6, టీసీజీఎస్-1694 రకం విత్తన వేరుశనగ 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2790 కాగా, 40 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటాగా రూ.1,674 చెల్లించాలని సూచించారు. కదిరి లేపాక్షి రకం 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.2,460 అని, సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.1,476 చెల్లించాలని సూచించారు. అర ఎకరా వరకు (30 కేజీ వేరుశనగ బ్యాగ్) ఒక బ్యాగ్, అర ఎకరం నుంచి ఎకరం వరకూ 2 బ్యాగ్‌లు, ఒక ఎకరా నుంచి ఆపైన భూమి ఉన్న రైతులకు 3 బస్తాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీడుతున్న మిస్టరీ

గుర్తుతెలియని శవానికి ఏడాది తర్వాత రీపోస్టుమార్టం

హత్యేనని పోలీసుల నిర్ధారణ...?

ధర్మవరం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఏడాది తర్వాత మిస్టరీ వీడుతోంది. రీ పోస్టుమార్టం నిర్వహించడంతో గుర్తుతెలియని శవం వివరాలు తెలిశాయి. మండలంలోని నాగలూరు వద్ద గత ఏడాది ఏప్రిల్ 23న గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. అప్పట్లో రూరల్ పోలీసులు గుర్తుతెలియని శవంగా కేసు నమోదు చేశారు. ఇటీవల ఎస్పీ రత్న పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో రూరల్ పోలీసులు గుర్తుతెలియని శవంగా నమోదైన కేసును పరిశీలించారు. ఈ గుర్తుతెలియని శవం ఎవరిదని లోతుగా దర్యాప్తు చేపట్టగా పోతుకుంట గ్రామానికి చెందిన కురుబ మంజునాథ్(33)గా గుర్తించారు. అనుమానం వచ్చిన పోలీసులు సాంకేతికను ఉపయోగించి తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ప్రమాదవశాత్తు మంజునాథ్ మృతి చెందలేదని, హత్య చేయబడ్డాడని పోలీసులు కొన్ని కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. అందులో భాగంగా ఇప్పటికే పలువురిని విచారించి ఈకేసును ఓ కొలిక్కి తెచ్చినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి గురువారం పట్టణంలోని శ్మశానవాటికలో రూరల్ సీఐ ప్రభాకర్, తహసీల్దార్ నటరాజ, వైద్యప్రొఫెసర్ల సమక్షంలో రీపోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య, ఆమెకు సంబంధించిన వారిని కూడా పోలీసులు విచారించినట్లు సమాచారం. వివాహేతర సంబంధమే హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. రీపోస్టుమార్టం ఆధారంగా త్వరలోనే ఈ కేసు మిస్టరీ వీడే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

సందట్లో సడేమియా..!

బదిలీలు, ప్రమోషన్ల వేళ ఏఎస్‌ఓ పోస్టు భర్తీ

ఆగమేఘాల మీద పోస్టింగ్‌పై విమర్శలు

డీఈఓ ఆఫీస్ ఏఎస్‌ఓగా శ్రీనివాసులు

ఓ ఎమ్మెల్యే, ఓ ఎమ్మెల్సీ ద్వారా డీఈఓ, ఆర్‌జేడీపై ఒత్తిడి



డీఈఓ వెనుక కూర్చున్న శ్రీనివాసులు

అనంతపురం విద్య, మే 29(ఆంధ్రజ్యోతి): ఒక వైపు బదిలీలు, మరో వైపు ప్రమోషన్లు. ఇంత హడావుడిలోనూ విద్యాశాఖలో వివాదాస్పదమైన ఏఎస్‌ఓ పోస్టును ఆగమేఘాల మీద భర్తీ చేసినట్లు సమాచారం. ఏఎస్‌ఓ గా గతంలో పనిచేసిన శ్రీనివాసులునే మళ్లీ నియమించినట్లు విద్యాశాఖ లో చర్చ సాగుతోంది. జిల్లాలో కుప్పలు తెప్పలుగా గణిత స్కూల్ అసిస్టెంట్లు ఉన్నా, వారందరినీ కాదని ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌ను నియమించినట్లు స్పష్టమవుతోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి జిల్లా విద్యాశాఖాధికారి ఈ నియామకం చేసినట్లు సమాచారం. ఆగమేఘాల మీద ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయన గురువారం విధుల్లో చేరినట్లు విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గతంలో ఏఎస్‌ఓగా నాగరాజును నియమించడంతో అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో 24 గంటల్లో ఉత్తర్వులు రద్దు చేశారు. మరి ఇప్పుడు ఏం చేస్తారో చూడాలి.

ఉత్తర్వులిచ్చి బయట పెట్టలేదా..?

అనంతపురం జిల్లా విద్యాశాఖలో ఏఎస్‌ఓ పోస్టు ఖాళీగా ఉంది. అత్యంత కీలకమైన ఈ పోస్టుకు తీవ్రమైన పోటీ ఉంది. దీంతో ఈ పోస్టు భర్తీ వెనుక రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉంటాయి. గత ఏడాది డిసెంబరులో ఏఎస్‌ఓగా నాగరాజును తీసుకోవడంపై విమర్శలు రావడంతో కొందరు సంఘాల నాయకులు ఈ సమస్యను కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ వరకూ తీసుకెళ్లారు. దీంతో ఉత్తర్వులిచ్చిన 24 గంటల్లోనే రద్దు చేశారు. ఆ తర్వాత సుమారు ఆరు మాసాలుగా దీన్ని భర్తీ చేయలేదు. కానీ భర్తీ చేయాలంటూ రాజకీయ ఒత్తిళ్లు అధికారులపై వస్తున్నాయి. నెల రోజులుగా డీఈఓ ప్రసాద్‌బాబుపై ఒక మాజీ మంత్రి, ఎమ్మెల్యేతోపాటు, ఓ ఎమ్మెల్సీ ద్వారా కొందరు సంఘాల నాయకులు తమ వ్యక్తికే ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. డీఈఓతోపాటు, ఆర్‌జేడీపైన కూడా ఒత్తిడి పెంచినట్లు సమాచారం. దీంతో ఉన్నపలంగా భర్తీ చేసి, ఉత్తర్వులు బయట పెట్టకుండా గోప్యంగా ఉంచారని తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో అర్హులే లేరా?

ఏఎస్‌ఓ పోస్టు భర్తీ చేసే క్రమంలో ప్రధాన అర్హతగా గణితం సబ్జెక్టు చూస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణితం స్కూల్ అసిస్టెంట్లు చాలా మంది ఉన్నారు. అయితే ప్రధాన అర్హతలున్న టీచర్లను కాదని ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌తో భర్తీ చేయడం విమర్శలకు తావిస్తోంది. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, ఒత్తిళ్లు ఉన్నాయంటూ.... కీలకమైన ఏఎస్‌ఓ పోస్టులో కూర్చోబెట్టడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా నామినేటెడ్ తరహాలో పోస్టును భర్తీ చేయడంపై దుమారం రేగుతోంది.

మొన్న ఇచ్చాం.. నిన్న జాయిన్ అయ్యారు: ప్రసాద్‌బాబు, డీఈఓ

జిల్లా విద్యాశాఖ ఏఎస్‌ఓగా శ్రీనివాసులును మంగళవారం నియమించాం. ఆయన బుధవారం జాయిన్ అయ్యారు. ఆయన ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్. ఆయనకు డిగ్రీలో స్టాటస్టిక్స్ బ్యాక్ గ్రౌండ్ ఉంది.

సత్యం అరెస్టు..!

(5వ పేజీ తరువాయి)


పుట్టపర్తిలో కలకలం రేపుతోంది.

నమ్మేదెలా..?

రియల్ వ్యాపారంలో పెట్టుబడుల పేరిట రూ.12.50 కోట్లు తీసుకుని మోసగించాడని అమెరికాకు చెందిన అర్విన్ ఫిర్యాదుతో రత్నాకరం సత్యనారాయణ రాజుపై ఈనెల 22న పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని పోలీసులు చెబుతున్నారు. కానీ ఈ నెల 20వ తేదీనే సత్యనారాయణరాజును పుట్టపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అతని కుటుంబ సభ్యులు అంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు చిత్రహింసలు పెట్టి, అతని పేరిట ఉన్న విలువైన భూమిని రాయించుకున్నారని అంటున్నారు. ఈ వ్యవహారంలో పుట్టపర్తికి చెందిన కొందరు రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు, పోలీసుల ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతోంది. సత్యనారాయణరాజుకు ముసుగువేసి పలుమార్లు బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకువెళ్లారని, బలవంతంగా ఆస్తులను రాయించుకున్నారని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వారం కిందటే పోలీసులు అదుపులో ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతుంటే.. అతను బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎలా వెళ్లాడనే ప్రశ్న తలెత్తుతోంది. ముసుగువేసి తీసుకువెళ్లడం, బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించడం వెనుక పోలీసుల పాత్రను కొట్టిపారేయలేము. సత్యనారాయణ రాజు కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు పలుమార్లు పోలీసుల వద్దకు వెళ్లినా స్పందించకపోవడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

విలువైన భూములను గుర్తించి..

అర్విన్ ప్రిన్సెస్ మహీంద్రకర్ వద్ద తీసుకున్న డబ్బుతో సత్యనారాయణరాజు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం, చెల్లికెర, గోరంట్ల సహా పలు ప్రాంతాల్లో పలు భూములు, స్థలాలను కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీటిలో ఎనిమిది చోట్ల సత్యనారాయణరాజు పేరిట ఉన్న విలువైన భూములు, స్థలాలను గుర్తించి, వారం రోజులుగా ప్రైవేట్ వ్యక్తులతో బెదిరించి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.కోటికిపైగా చేతులు మారినట్లు సమాచారం. పోలీసులు మాత్రం బుధవారం సాయంత్రం రత్నాకరం సత్యనారాయణరాజును అరెస్టు చేశామని అంటున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయం తమకు తెలియదని బుకాయిస్తున్నారు. తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అంటున్నారు. డ్యాంకుమెట్లను సీజ్ చేశామని పోలీసులు చెబుతున్నా, పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి చేత రిజిస్ట్రేషన్‌లు ఎలా చేయించారనే ప్రశ్నకు సమాధానం లేదు. ఈ వారం రోజుల్లో బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సత్యనారాయణరాజు ఒక్కరే వచ్చారా..? ముసుగు వేసి తీసుకెళ్లింది ఎవరు? ఇష్టపూర్వకంగా రిజిస్ట్రేషన్లు చేయించారా..? అన్నది తేలాల్సి ఉంది. పోలీసు శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని లోతుగా దర్యాప్తు చేస్తే తెరవెనుక ఏం జరిగిందన్నది బయటకు వస్తుంది.



సుమతి పేరుతో రిజిస్టర్ అయిన సత్యనారాయణ రాజు ఆస్తి వివరాలు

రూ.12.5 కోట్ల మోసం: డీఎస్పీ

పుట్టపర్తి రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అధిక లాభాలు వస్తాయని విదేశీయుడిని నమ్మించి మోసగించిన కేసులో నిందితుడు సత్యనారాయణ రాజును అరెస్టు చేశామని పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని గోకులానికి చెందిన సత్యనారాయణరాజు అమెరికాకు చెందిన అర్విన్ ఫ్రాన్సిస్ మహేంద్రకర్‌తో పరిచయం పెంచుకుని, పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే లాభాలు వస్తాయని నమ్మించాడని తెలిపారు. అర్విన్‌తో బ్యాంకు లావాదేవీల ద్వారా రూ.12.5 కోట్లు తీసుకున్నాడని, ఆ మొత్తంతో ప్లాట్లు, భూములు కొనుగోలు చేశాడని తెలిపారు. అమెరికా నుంచి వచ్చిన అర్విన్, బ్యాంకు లావాదేవీల ద్వారా పంపిన రూ.8 కోట్లతో కొన్న ఆస్తుల వివరాలను అడిగారని, దీంతో 'నీకు ఏం సంబంధం..? నువ్వు నాకు డబ్బులు ఏమీ ఇవ్వలేదు' అని బుకాయించాడని తెలిపారు. ఆ రూ.8 కోట్లే కాకుండా సత్యనారాయణ తన విలాసాల కోసం, క్రికెట్ బెట్టింగ్‌కు రూ.2.50 కోట్లు, షేర్‌మార్కెట్లో పెట్టుబడులకు రూ.2 కోట్లు తీసుకున్నాడని తెలిపారు. మొత్తంగా అర్విన్ నుంచి రూ.12.5 కోట్ల వరకూ డబ్బులు తీసుకుని మోసగించాడని డీఎస్పీ తెలిపారు. అర్విన్ ఫిర్యాదు మేరకు, ఎస్పీ రత్న ఆదేశాలతో ఈ నెల 22న పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశామని, నిందితుడిని ఈ నెల 28న అరెస్టు చేశామని తెలిపారు.

ఖాళీలతో కబడ్డీ...!

(5వ పేజీ తరువాయి)

జడ్పీ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. గత ఏడాది ఆఖరి వరకూ హడావుడి చేసి, అర్ధరాత్రి తర్వాత ఉత్తర్వులు ఇచ్చి అక్రమాలకు తెరలేపారు. ఈసారి కూడా అదేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించకుంటే సాధారణ ఉద్యోగులకు తిప్పలు తప్పవు.

గోప్యత ఎందుకు?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడ్పీ యాజమాన్యం కింద నడిచే ఎంపీడీఓ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర సంస్థల్లో ఖాళీలను జడ్పీ సీఈఓ ప్రకటించారు. కానీ ఎంపీడీఓ వేకెన్సీలు చూపలేదు. రెండు జిల్లాల్లో ఉన్న ఖాళీలు (ఎగ్జిస్టింగ్) 7, అరైజింగ్ వేకెన్సీలు 3(మే 31 నాటికి రిటైర్‌మెంట్) కలిపి మొత్తం 10 ఖాళీలు ఉన్నాయి. వీటిని నోటీస్‌బోర్డులో చూపలేదు. జూనియర్ అసిస్టెంట్ల ఖాళీల చూపడంలో కూడా పారదర్శకత పాటించలేదు. కొన్ని ఖాళీలు చూపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

జడ్పీ ఉద్యోగుల వివరాలు

జడ్పీ యాజమాన్యంలో రెండు జిల్లాల పరిలోట వందలాది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఏవో నుంచి ఆఫీస్ సబార్డినేట్స్ వరకూ కేడర్ స్ట్రెంత్, వర్కింగ్ ఉద్యోగుల వివరాలు ఇలా ఉన్నాయి.

కేడర్	కేడర్ స్ట్రెంత్	వర్కింగ్
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు	74	70
సీనియర్ అసిస్టెంట్లు	120	118
జూనియర్ అసిస్టెంట్లు	243	214
టైపిస్టులు	91	82
రికార్డ్ అసిస్టెంట్లు	206	190
ల్యాబ్ అసిస్టెంట్లు	63	50
లైబ్రరీ అసిస్టెంట్లు	02	01
ఆఫీస్ సబార్డినేట్స్	511	173

కలెక్షన్ బ్యాచ్ నడిపిస్తోందా..?

బదిలీలకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ఇప్పటి వరకూ 231 దరఖాస్తులు వచ్చాయని జడ్పీ అధికారులు చెబుతున్నారు. వాటిని స్క్రూట్రినీ చేసి, పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించాలి. కానీ ఇప్పటి వరకూ కౌన్సెలింగ్ తేదీని ప్రకటించలేదు. పొరుగు జిల్లా కర్నూలులో జూన్ 1న కౌన్సెలింగ్ నిర్వహించేలా ఆ జిల్లా సీఈఓ 28వ తేదీనే ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ క్లారిటీ ఇవ్వలేదు. గత ఏడాది కూడా ఆఖరి వరకూ హడావుడి చేశారు. అర్ధరాత్రి ఉత్తర్వులు ఇచ్చి అడ్డగోలు వ్యవహారాలకు తెరలేపారు. దగ్గరి ఖాళీలను అమ్మేసి అభాసుపాలయ్యారు. ఈ ఏడాది కూడా బేరసారాలకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. జడ్పీ ఉన్నతాధికారి చుట్టూ కలెక్షన్ బ్యాచ్ మూగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంపీడీఓలు, ఏవోలు బదిలీల ప్రక్రియలో సీనియర్ అధికారులు కీలకంగా వ్యహరించడం, ఉన్నతాధికారులకు సూచనలివ్వడం పరిపాటి. కానీ జడ్పీలో మాత్రం ఒక సీనియర్ అసిస్టెంట్ తన కలెక్షన్ బ్యాచ్‌ను వేసుకుని సీనియర్లను రానివ్వకుండా, బదిలీల్లో చక్రం తిప్పుతున్నాడని అంటున్నారు. కలెక్టర్ దృష్టి సారించకుంటే అక్రమాలు పునరావృతమౌతాయని అంటున్నారు.

వైద్యంలో నిర్లక్ష్యం

బాధితుడికి రూ.20 లక్షల పరిహారం

వినియోగదారుల కమిషన్ తీర్పు

అనంతపురం క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించినందుకు బాధితుడికి రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పునిచ్చింది. దీంతోపాటు చికిత్స కోసం బాధితుడు చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాలని, న్యాయవాది ఖర్చు కింద మరో రూ.5 వేలు చెల్లించాలని ఆదేశించింది. అనంతపురం నగరానికి చెందిన న్యాయవాది సుగుణాకర్ బాబు 2023 ఫిబ్రవరి 27న హైదరాబాద్‌లోని ప్రైడ్ ఆస్పత్రిలో.. డాక్టర్ చైతన్య కొమ్రేవార్ వద్ద మోకాలికి పీఆర్పీ చికిత్స చేయించుకున్నారు. చికిత్స అనంతరం ఆయన మోకాలి కీళ్లు మరింత బాధించాయి. పుండ్లు ఏర్పడటంతో అనేకసార్లు ఆసుపత్రికి తిరగాల్సి వచ్చింది. ప్రాథమికంగా చిన్న ఆపరేషన్‌తో అంతా సరిపోతుందని చెప్పిన వైద్యుడు.. 30 సెంటీమీటర్లు పొడవున కాలు కోసి, పెద్ద శస్త్రచికిత్స చేశారు. అది విఫలం కావడంతో బాధితుడు 2023 ఏప్రిల్‌లో బెంగళూరులోని సెయింట్‌జాన్స్ ఆసుపత్రిలో చేరి మరో మారు శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. దీని కోసం రూ.2.5 లక్షలు ఖర్చు పెట్టాడు. ఈ క్రమంలో న్యాయవాద వృత్తికి దూరమయ్యాడు. తనకు జరిగిన నష్టంపై సుగుణాకర్ బాబు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. నోటీసులు అందుకున్న వైద్యుడు, కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చుకున్నాడు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయిందని జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు గోపీనాథ్ తీర్మానించారు. బాధితునికి రూ.20 లక్షల పరిహారం, రూ.76,102 వైద్య ఖర్చులు, రూ.5వేలు న్యాయవాది ఖర్చులు చెల్లించాలని డాక్టర్ చైతన్య కొమ్రేవార్‌ను జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్‌మేరీ, గోపీనాథ్ ఆదేశించారు. ఈ మొత్తాన్ని 45 రోజుల్లోగా చెల్లించాలని, లేకపోతే 8శాతం వార్షిక వడ్డీతో కలిపి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

గందరగోళంగా మొదలై..!



మైక్ సరిగా పనిచేయక వినిపించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న టీచర్లు



ప్రశాంతంగా ఉండండి అంటూ హెచ్చరిస్తున్న పోలీసులు

(5వ పేజీ తరువాయి)

అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. విద్యాశాఖకు సంబంధం లేని కొందరు సంఘాల నేతల వచ్చి ప్రశ్నిస్తుండటంతో ఇతర టీచర్లు అభ్యంతరం తెలిపారు. మీరెవరని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. నాయకులు, అధికారుల మధ్య గొడవ ముదరడంతో పోలీసులను పిలిపించారు. పోలీసులు వచ్చాక కౌన్సెలింగ్ కొనసాగింది. జడ్పీలో 120 పోస్టులకు, మున్సిపాలిటీల్లో 20 పోస్టులకు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 పోస్టులకు 1:3 ప్రకారం అభ్యర్థులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు.

చీకట్లతో తిప్పలు

కౌన్సెలింగ్ ప్రాంతంలో లైట్లు సరిగా లేకపోవడంతో టీచర్లకు అవస్థలు తప్పలేదు. మైక్ సరిగా పనిచేయకపోవడం, కూర్చోడానికి సరిపడా కుర్చీలు లేకపోవడం, వెలుతురు లేకపోవడంతో రాత్రి అందరూ అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం ప్రారంభమైన సాయంత్రానికి పూర్తవుతుందనుకున్న కౌన్సెలింగ్ రాత్రి వరకూ కొనసాగింది. సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో ప్రక్రియను ముగించారు.

ఇంటర్మీడియట్‌తో ఉద్యోగాలు

అనంతపురం సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశం కల్పించేలా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చర్యలు చేపట్టింది. ఇంటర్మీడియట్‌లో 75 శాతంపైగా, గణితంలో 60శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగం ఇవ్వనున్నారు. గణితం మినహా ఇతర గ్రూపుల్లో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు నాన్-ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయిన వారికి ఏడాదిపాటు శిక్షణ, మూడు నెలలు క్లాస్‌రూమ్ ట్రైనింగ్ ఉంటుంది. మరో తొమ్మిది నెలలు చైన్నైలోని హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేస్తూ నెలకు రూ.10వేల చొప్పున స్టైఫండ్ పొందవచ్చు. అనంతరం ఉద్యోగంలోకి చేరిన వారికి రూ.1.70 లక్షల వార్షిక వేతనం చెల్లిస్తారు. https://registrations.hcltechbee.com/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారికి కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (క్యాట్) నిర్వహించి, హెచ్ఆర్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆఫర్ లెటర్‌ను అందజేస్తారు.

డిగ్రీ, పీజీకి ఆర్థిక సహకారం..

ఇంటర్మీడియట్‌తోనే ఉద్యోగ జీవితం ప్రారంభించి అక్కడితోనే విద్యార్హత ఆగిపోకుండా డిగ్రీ, పీజీ చేయడానికి ఆర్థిక సహకారం అందిస్తారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేందుకు హెచ్‌సీఎల్ సంస్థ ప్రోత్సహిస్తుంది. అందుకు ఏఎంఐటీవై, శాస్త్ర, కేఎల్ వర్సిటీలతో అఫిలియేషన్ చేసుకుంది. తద్వారా డిగ్రీలో బీబీఏ, బీకాం, పీజీలో బీసీఏ, ఎంసీఏ, ఎంబీఏ అడ్మిషన్స్ కల్పిస్తుంది. అందుకు హెచ్‌సీఎల్ కంపెనీ ఆర్థికంగా సహకారం అందిస్తుంది.

ఎస్‌డీసీ కేంద్రంలో ఇంటర్వ్యూలు

రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు జేఎన్‌టీయూ క్యాంపస్ ఎదురుగానున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్‌డీసీ) కేంద్రంలో హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు జూన్ 5న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు పదోతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల జాబితాలు, ఆధార్‌కార్డుతోపాటు రెండు ఫొటోలతో హాజరుకావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి కోరారు. వివరాలకు 7780754278, 8309173344, 7780323850, 9642973350 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(సీఈ) డాక్టర్ లోకేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. జూన్ 4వతేదీలోపు రూ.2,200 ఫీజు చెల్లించాలన్నారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఏ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. జ్ఞానభూమి పోర్టల్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులను కళాశాల లాగిన్ నుంచి అప్‌లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 8న కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మే 29(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి(చైర్మన్)గా ముంటిమడుగు కేశవరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకార ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్‌ను ప్రకటించి నెల రోజులు గడిచింది. ఏడీసీసీ బ్యాంకుకు ఏడుగురు సభ్యులు, డీసీఎంఎస్‌తోపాటు ఆయా సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాల్సి ఉంది.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



ఓబులేసు (ఫైల్)

సోమందేపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక చేనేత కార్మికుడు ఉప్పర ఓబులేసు(46) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మారుతీనగర్‌కు చెందిన ఓబులేసు చేతి మగ్గం వేసుకుని జీవనం సాగించేవాడు. మరమగ్గాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇటీవల బయటి వ్యక్తుల వద్ద రూ.5లక్షలు అప్పు చేశాడు. కుటుంబ ఖర్చులు, కుమార్తె పెళ్లి కోసం ఇంటిని తాకట్టుపెట్టి మరో రూ.5లక్షలు అప్పు చేశాడు. ఈ అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. ఇదే సమయంలో రుణదాతల ఒత్తిడి పెరగడం, ఏర్పాటు చేసుకున్న మగ్గంలో ఆశించిన లాభాలు రాకపోవడంతో మనస్తాపం చెందాడు. దీంతో ఇంట్లోనే గురువారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తె అమృత, కుమారుడు గణేష్ ఉన్నాడు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు ఇంటర్ పూర్తి చేశాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

బైకును ఢీకొట్టిన కారు... రైతు మృతి

క్రాప్ లోన్ రెన్యువల్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం



గోనుగుంట్ల ప్రతాప్ (ఫైల్)

ధర్మవరంరూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయరహదారిపై ద్విచక్రవాహనాన్ని ఓ కారు ఢీకొట్టిన ప్రమాదంలో రైతు మృతి చెందాడు. రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు కనగానపల్లి మండలం చంద్రాచెర్ల గ్రామానికి చెందిన గోనుగుంట్ల ప్రతాప్(55) తన భార్య సుబ్బమ్మతో కలిసి క్రాప్‌లోన్ రెన్యూవల్ కోసం మామిళ్లపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రెన్యూవల్ ముగించుకుని సాయంత్రం చంద్రాచెర్ల గ్రామానికి ద్విచక్రవాహనంపై భార్యభర్తలు బయల్దేరారు. సీతారంపల్లి క్రాస్ వద్ద బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రతాప్, సుబ్బమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ప్రతాప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సుబ్బమ్మ చికిత్స పొందుతున్నారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దీపం అంటుకుని వృద్ధుడి మృతి

రాప్తాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినేపల్లి సమీపంలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న శివాలయం పూజారి మన్నల నరసింహుడు(74) ప్రమాదవశాత్తు దీపము అంటుకుని మృతి చెందాడు. రాప్తాడు సీఐ తెలిపిన మేరకు... రామినేపల్లికి చెందిన మన్నల నరసింహుడు కొన్నేళ్ల నుంచి శివాలయం పూజారిగా ఉండేవాడు. ఆయన కుటుంబ సభ్యులు ప్రతి రోజూ భోజనం తీసుకుని వెళ్లి శివాలయం వద్ద ఉన్న నరసింహుడికి ఇచ్చేవారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా నరసింహుడుకి చూపు మందగించింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గర్భగుడి ముఖద్వారం వద్ద నిద్రించాడు. అయితే ఆయన పడుకోవడానికి ఉపయోగించిన అట్టముక్కలు పక్కనే ఉన్న దీపము తగిలి అంటుకున్నాయి. ఈక్రమంలో రగ్గుకు మంటలు వ్యాపించాయి. నరసింహుడు మంటలు ఆర్పుకోవడానికి ఆలయం ముందున్న ప్లాస్టిక్ డ్రమ్ము వద్దకు వెళ్లి, చేతకాక అక్కడే పడిపోయి మృతి చెందినట్లు ఆనవాళ్లు కనిపించాయి. గురువారం ఉదయం నరసింహుడుకి కుటుంబ సభ్యులు భోజనం ఇచ్చేందుకు వెళ్లగా ఒళ్లు కాలిపోయి విగతజీవిగా పడి ఉన్నాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరసింహుడు సోదరి పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.34వేలు

అనంతపురం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34వేలు, కనిష్ఠంగా రూ.4,600, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 741టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

కడప మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది

● ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



ఒంటిమిట్ట కోదండరామాలయం సందర్శనకు వెళ్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడు రాజకీయ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మహానడులో చివరి రోజు జరిగిన బహిరంగ సభలో వారు పాల్గొన్నారు. ముందుగా గురువారం ప్రాచీన హిందూ దేవాలయమైన ఒంటిమిట్ట కోదండరామాలయక్షేత్రాన్ని ఎమ్మెల్యే తన స్నేహితురాలైన పీతల సుజాతతో కలసి సందర్శించారు. అనంతరం దేవునిగడపలో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. దేవుని గడప అంటే వేంకటేశ్వరస్వామి ప్రవేశద్వారం కడప అనేపేరు గడప అనేపదం నుంచి వచ్చిందని అర్చకులు ఎమ్మెల్యేకు వివరించారు. మధ్యాహ్నం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత కడపలో మహానాడు జరగడం ఇదే తొలిసారి.కచ్చితంగా ఇది చరిత్రలో నిలిచిపోతుందని వారన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌పై దృష్టి సారించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగాడేను పురస్కరించుకుని చేపడుతున్న యోగాంధ్ర క్యాంపెయిన్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే చేపడుతూ ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాలో 24లక్షల మంది ఉంటే ఇప్పటికి 6లక్షల మందిని మాత్రమే రిజిస్ట్రర్‌చేయించారని, ఈసంఖ్యను వేగంగా పెంచాలని సూచించారు. జూన్21వ తేదీన చేపడుతున్న యోగాడేను ప్రతిసచివాలయాలలో నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్‌గా పీపీ రావు



గార్లదిన్నె, మే29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్‌గా పీపీ రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డైరెక్టర్ మధ్య ప్రదేశ్‌లోని నాందేడ్ బుద్నీ సంస్థకు బదిలీఅయ్యారు. బుద్నీ సంస్థలో పని చేస్తున్న పీపీ రావు ఇక్కడికి బదిలీ అయ్యారు. 2016-22వరకూ పీపీ రావు ఇక్కడ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. తిరిగి ఇక్కడికే బదిలీపై రావడంతో ట్రాక్టర్ నగర్ సంస్థ సిబ్బంది సంతోషం వ్యక్తంచేశారు.

విస్తృతంగా మట్టి నమూనా సేకరణ



మట్టినమూనాను సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

చెన్నేకొత్తపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలో భూసార పరీక్ష కోసం వ్యవసాయశాఖ అధికారులు రైతుల పొలాల్లో విస్తృతంగా మట్టి నమూనాను సేకరిస్తున్నారు. ఏఓ ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 13న ప్రారంభమైన మట్టి సేకరణ వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందని ఏఓ తెలిపారు. ఒక్కో రైతు సేవా కేంద్రం నుంచి 95 శాంపిల్స్‌ను టార్గెట్‌గా నిర్ణయించామన్నారు. సేకరించిన మట్టిని పెనుకొండలోని పరీక్షా కేంద్రానికి పంపుతామన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా గంగాధర్

నార్పల,మే29(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా సాకే గంగాధర్ నియమితులయ్యారు. బుధవారం స్థానిక వాల్మీకి కల్యాణమండపంలో పార్టీ 6వ మండల మహాసభలను నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గంగాధర్, సహాయ కార్యదర్శులుగా చాపల రామాంజి, సుధాకర్‌తోపాటు 17 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. తవను ఎంపిక చేసిన జిల్లా కార్యదర్శి జాఫర్, పాలెం నారాయణ స్వామి, టీ నారాయణస్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీటీకి ఆర్థికసాయం

గార్లదిన్నె, మే 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్డీటీ)కు కార్మికులు, వ్యాపారులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని కల్లూరు ఆర్ఎస్ వద్దనున్న ఆర్డీటీ ఆఫీస్‌లో గురువారం స్పందించు-సాయం అందించు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జగ్గాల రవి తన స్నేహితులతో కలిసి వ్యాపారులు, ఆటో యూనియన్ కార్మికులతో రూ.32,500 అందజేశారు. సర్పంచు ప్రశాంతి, ఇండియా ఫర్ ఇండియా ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసులు, ఏటీఎల్ సావిత్రి, అవుట్రీచ్ ప్రోగ్రాం సూపర్‌వైజర్ అనిత, పోతన్న, లక్ష్మీకాంత, వలంటీర్ లీలావతి పాల్గొన్నారు.

రాప్తాడులో అన్న క్యాంటీన్

రాప్తాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు రూ.5కే భోజనం అందించేందుకు నియోజకవర్గ కేంద్రం రాప్తాడులో త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఉన్నత పాఠశాల సమీపంలో వాటర్ ట్యాంకు వద్ద క్యాంటీన్ ఏర్పాటుకు స్థలం సిద్ధం చేస్తున్నామన్నారు. క్యాంటీన్ నిర్మాణం కోసం చదును చేస్తున్న స్థలాన్ని గురువారం ఆమె పరిశీలించారు. మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చదును చేస్తున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు

ప్రత్యేక బస్సుల్లో మహానాడుకు కార్యకర్తలు

● జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కడపలో జరిగే ఆఖరురోజు మహానాడుకు బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం నగరశివారులోని శివకోటి ఆలయం నుంచి ప్రత్యేక బస్సులను నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బస్సును నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. బస్సులతోపాటు వాహనాల్లోనూ నాయకులు వెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి నారాలోకేశ్ సారథ్యంలో కోటి సభ్యత్వాలతో పార్టీ మరింతగా బలపడిందన్నారు. కడపలో నారాలోకేశ్ సారథ్యంలో 7 లక్షల మందికిపైగా కార్యకర్తలతో మహానాడు నిర్వహించి, చరిత్ర సృష్టించబోతున్నామన్నారు. మహానాడుతో వైసీపీ పునాదులు కదులుతున్నాయన్నారు. మహానాడుకు హాజరయ్యే కార్యకర్తలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా మార్గమధ్యలో సౌకర్యాలు కల్పించామన్నారు. ఎమ్మెల్యే సోదరుడు దగ్గుపాటి ప్రతాప్, నాయకులు గంగారామ్, గాజుల ఆదెన్న, జయరాంనాయుడు, రాజారావు, లక్ష్మీనరసింహ, చేపల హరి, స్వప్న, చరిత పాల్గొన్నారు.



అనంతపురం అర్బన్ నుంచి బయలుదేరిన ప్రత్యేక బస్సులు

పుష్కర జలాలతో సాయినాథుడికి అభిషేకం



పుష్కర జలాలతో సాయినాథుడికి అభిషేకం చేస్తున్న భక్తుడు

అనంతపురం కల్చరల్, మే 29(ఆంధ్రజ్యోతి): తపోవనంలోని శివశక్తిసాయి ఆలయంలో సాయినాథుడికి శుక్రవారం సరస్వతీ పుష్కర జలాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయినాథునితోపాటు శివుడి మూలవిరాట్‌కు తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలంపల్లి జిల్లాలోని మహదేవపురం మండలం కాళేశ్వరం నుంచి తీసుకువచ్చిన పుష్కర జలాలతోపాటు ఫలపంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాములు, దేవేంద్రనాథ్, సాయి ట్రస్టు సభ్యుడు రాఘవేంద్ర, కోదండరామ భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

జడ్జి బంగ్లా ప్రహరీని కారు ఢీకొన్న ఘటనపై కేసు

అనంతపురం క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోర్టు రోడ్డులో జడ్జి బంగ్లా ప్రహరీని కారు ఢీ కొన్న ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి 11గంటల సమయంలో థార్ కారు ప్రహరీని ఢీకొన్న విషయం తెలిసిందే. ప్రసన్నాయపల్లికి చెందిన అమర్‌నాథ్‌రెడ్డి నగరంలోని రామ్‌నగర్‌లో ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం సెకండ్ హ్యాండిల్ మహీంద్రా థార్ కారు కొన్నాడు. బుధవారం ఉదయం పూజ చేయించాడు. సాయంత్రం స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. రాత్రి 11గంటల సమయంలో వేగంగా వస్తూ కోర్టురోడ్డులోని జడ్జి బంగ్లా ప్రహరీని ఢీకొన్నాడు. ఈ ఘటనపై కోర్టు మేనేజర్ మాధవీలత ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అత్త, కోడలిపై దాడి

గార్లదిన్నె, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవాపురం గ్రామంలో అత్త శేషమ్మ, కోడలు సౌజన్యపై గురువారం ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. కేశవాపురం గ్రామానికి చెందిన వీరాంజనేయులు, సుంకన్న కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. 2022లో జరిగిన ఓ హత్యలో వీరాంజనేయులు జైలుకు వెళ్లాడు. 2024 ఆగస్టులో రాజీ కావడంతో కేసు కొట్టివేశారు. అప్పటి నుంచి కేశవాపురం విడిచిన వీరాంజనేయులు కుటుంబం ఆయన విడుదల అవుతుండడంతో కేశవాపురానికి వచ్చింది. ఇళ్లను శుభ్రం చేసేందుకు వచ్చిన అత్త, కోడలిపై సుంకన్నతో పాటు రవి, సురేష్, కర్ణ, భార్గవి కారంపొడి చల్లి కొడవళ్లతో దాడిచేసి గాయపరిచారన్నారు. క్షతగాత్రులకు గార్లదిన్నె ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్వర్ట్ పనుల టెండర్ రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో రూ.65లక్షల వ్యయంతో పిలిచిన కల్వర్టు పనుల టెండర్‌ను రద్దు చేశారు. ఈ నెల 17న తిరకాసు శీర్షికన వెలువడిన కథనానికి నగరపాలక కమిషనర్ బాలస్వామి స్పందించారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రి కోసం టెండరు వేయడం, అందులో కమీషన్ కోసం కొందరు పావులు కదపడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు టెండరు రద్దు చేశారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

ఆత్మకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తనకాయల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి సుచరిత కోరారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ ఫోన్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నార్పల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రంలో రైతులు తమపేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి చిన్నవీరస్వామి గురువారం ఒక ప్రకటనలో కోరారు. నార్పల మండలానికి 40శాతం రాయితీ కింద 1600 కింటాళ్ల వేరుశనగ కేటాయించారన్నారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మండలానికి చేరిన సబ్సిడీ విత్తన వేరుశనగ



విత్తన వేరుశనగ బస్తాలను గిడ్డంగిలోకి తరలిస్తున్న కూలీలు

శింగనమల, మే 29(ఆంధ్రజ్యోతి): మండలలోని గిడ్డంగులకు సబ్సిడీ విత్తన వేరుశనగ చేరాయని ఏఓ అన్వేష్ కూమార్ తెలిపారు. ఇప్పటి వరకు 1,400 బస్తాలు కే6 రకం కేటాయించారని, ప్రస్తుతం 700 బస్తాలు వచ్చాయన్నారు. నాణ్యమైన కాయలనే గిడ్డంగిలో ఉంచామని, నాణ్యత లేకపోతే వెనక్కు పంపుతామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ సోమశేఖర్ తెలిపారు. విద్యుత్‌లైన్ల మార్పులో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్ర 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ప్రమోషన్లు చేపట్టాలి

● ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌ఈఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ప్రమోషన్లలో పారదర్శకతను పాటించి రిజర్వేషన్ వర్గాలకు న్యాయం చేయాలని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్, రోస్టర్ ప్రాతిపదికన నివేదకలు రూపొందించి అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. సిఫార్సులున్న వారికి, అడ్డదారుల్లో కారణాలు చూపేవారికి ప్రాధాన్యతివ్వడంతో అర్హులకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో ఎల్లన్న, ఉజ్వల్, నగేష్, ఓబులేష్, శివ, గంగాధర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

● 9 టన్నుల ప్లాస్టిక్ సీజ్
● రూ.2.45 లక్షల జరిమానా



నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్

అనంతపురం క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అధికారులు ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణాలపై గురువారం దాడులు నిర్వహించారు. నగర కమిషనర్ బాలస్వామి 11 వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసి దాడులు చేపట్టారు. ప్రతి బృందంలో ఓ గెజిటెడ్ ఆఫీసర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2016 ప్రకారం విధించిన రుసుం చెల్లించినట్లయితే గెజిటెడ్ ఆఫీసర్ సంతకం, నోటీసు, రశీదు మూడు కలిపి కోర్టు లేదా పోలీసుల నుంచి సమన్లు జారీ చేసే అవకాశం ఉండేలా అధికారులు వ్యవహరించారు. మహాదేవ్ ట్రేడర్స్, భవానీ ప్లాస్టిక్స్, మహావీర్ ప్లాస్టిక్స్, మహాలక్ష్మి ప్లాస్టిక్స్, భవానీ జనరల్ స్టోర్స్, రేఖ ట్రేడింగ్ కంపెనీ, చాముండి పాలిమర్స్, కేసర ప్లాస్టిక్స్, ఎస్వీఎస్ ఇండస్ట్రీస్, గంగా ట్రేడింగ్ పేర్లతో ఉన్న 11 హోల్‌సేల్ వ్యాపార దుకాణాలపై దాడులు చేశారు. 9 టన్నుల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. రూ.2.45లక్షల జరిమానా విధించారు. ఓ దుకాణంలో దాడులకు ఆటంకం కలిగించారనే కారణంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు, నగరంలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రజారోగ్యం దృష్ట్యా దాడులు చేశామన్నారు. ఇకపై కూడా దాడులు కొనసాగుతాయని, రెండో సారి పట్టుబడితే రూ.50వేల జరిమానాతో పాటు దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇది వరకు నగరంలోని 56 మంది ప్లాస్టిక్ వినియోగదారులకు నోటీసులు పంపామని, అవగాహన కల్పించాకే దాడులు చేశామన్నారు. ఇది ఏ ఒక్కరినో ఇబ్బంది పెట్టే కార్యక్రమం కాదన్నారు. ప్రత్యామ్నాయంగా గోనె సంచులు, జ్యూట్ బ్యాగ్ లేదా క్లాత్‌బాక్స్ వినియోగించుకోవాలన్నారు.

యోగాతోనే ఆరోగ్యం సురక్షితం: కమిషనర్



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట యోగసనాలు వేస్తున్న జిల్లా అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్/క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ప్రజలందరి ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని పలువురు జిల్లా అధికారులు అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా గురువారం స్థానిక సప్తగిరి సర్కిల్‌లో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా జిల్లా అధికారులు, ప్రజలు యోగసనాలు వేశారు. కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ప్రజలందరూ యోగాంధ్రలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, ఫిట్‌నెస్ యోగాతోనే సాధ్యమవుతాయన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు లు కృషి చేస్తున్నారని అన్నారు. డ్వామా పీడీ సలీంబాషా, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, నగరపాలక సంస్థ ఎస్ఈ చంద్రశేఖర్, ఆయుష్ అధికారులు రామ్‌కుమార్, భాస్కర్, యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజా, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శింగనమల: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జి ఈఓఆర్డీ లీలారాణి అన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.ఈ అమె మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సమస్యలతో సతమవుతుంటారని, యోగా చేయడంతో వాటి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. వీఆర్ఓ ఎర్రితాతయ్య, సచివాలయ సిబ్బంది జయశ్రీ, శిల్పా, సుధాకర్, రమేష్, మధుసూదన్, ప్రజలు పాల్గొన్నారు.

రాప్తాడు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. యోగాంధ్ర సందర్భంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈఓఆర్డీ ఆనంద్‌ప్రసాద్, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

కడపలో జరుగుతున్న మహానాడుకు పలు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఉత్సాహంగా తరలివెళ్లారు. నాయకులు ప్రత్యేక బస్సులు, వాహనాలను ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



శింగనమల నుంచి మహానాడుకు బయల్దేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



గార్లదిన్నె నుంచి బయలుదేరుతున్న నాయకులు



రామగిరి మండలం పేరూరు నుంచి బయలుదేరుతున్న టీడీపీ నాయకులు



కార్యకర్తలకు భోజనం వడ్డిస్తున్న వెంకటశివుడుయాదవ్, ముంటిమడుగు కేశవరెడ్డి

1న జిల్లా మహిళా హాకీ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక పోటీలు జూన్ 1న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామని హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు. 2006 జనవరి 1 తరువాత జన్మించిన మహిళా క్రీడాకారిణులు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల జాబితా, యూనిఫాంతో పోటీసులకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జట్టు జూన్ 6 నుంచి భీమవరంలో జరిగే జూనియర్ మహిళా హాకీ చాంపియన్‌షిప్-2025 పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

మీడియా అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, మే29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మీడియా అక్రిడిటేషన్ల గడువు మరో మూడునెలలు పొడిగించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు.

రక్తదానం చాలా గొప్పది



ఎన్టీఆర్ ట్రస్ట్ ఆఫీసర్ల చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న ఆలం వెంకటనరసానాయుడు

నార్పల, మే29(ఆంధ్రజ్యోతి): మండలంకేంద్రంలో రెండు సంవత్సరాలుగా 1070 యూనిట్లు రక్తదానం చేసినందుకు కడపలో జరుగుతున్న మహానాడులో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ డోనేషన్ క్యాంపులో వెంకట్ వకుళ ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకటనరసానాయుడును సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ రక్తదానం చాలా గొప్పదని, అనేక మంది ప్రాణాలు కాపాడుతుందన్నారు. వెంకట నరసానాయుడుకు ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విశ్రాంత డీజీపీ రాజేంద్రకుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపి అడుసు మల్లి ఘనంగా సన్మానించారు.

పరిటాల శ్రీరాములయ్యకు ఘన నివాళి



పరిటాల శ్రీరాములయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రామగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): పరిటాల శ్రీరాములయ్య 50వ వర్ధంతి సందర్భంగా గురువారం కొత్తగేరి(ఎగువపల్లి)లోని ఆయన స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. పరిటాల శ్రీరాములయ్య కుమార్తె జయమ్మ, ఆయన అల్లుడు ధర్మవరపు జయంతప్ప, వడ్లమూడి క్రిష్ణారావు మెమోరియల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలువేసి స్థూపం వద్ద శ్రీరాములయ్య అమర్‌రహే అంటూ నినదించారు. వారు మాట్లాడుతూ పరిటాల శ్రీరాములయ్య భూమి కోసం, భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం తన ఊపిరి ఉన్నంత వరకు పోరాటాలు చేశారన్నారు. పరిటాలశ్రీరాములయ్యతో పాటు అమరులైన పరిటాల సుబ్బయ్య, లింగన్న, రామాంజనేయులుకు కూడా నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవ, సుందరం, ఓబుళరాజు, డి.పోతన్న, వెంకటరాముడు, సురేశ్, కేపీ ముత్యాలు, శీన, ఓబుళేశు, రమణ పాల్గొన్నారు.

జనరల్ ఫండ్ దుర్వినియోగంపై విచారణ

గుంతకల్లుటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో 2020-25వ సంవత్సరానికి సంబంధించి జనరల్ ఫండ్, 15వ ఫైనాన్స్ నిధులు దుర్వినియోగంపై పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డివిజనల్ పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ విచారణ చేపట్టారు. ధర్మహ్యూమన్‌రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు గుంతకల్లు మండలంలోని పంచాయతీల్లో జనరల్ ఫండ్, ఫైనాన్స్ నిధులు దుర్వినియోగం అయ్యాయని , విచారణ జరిపించాలని ఇటీవల డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 పంచాయతీలలో జనరల్ ఫండ్, 15వ ఫైనాన్స్ కింద జరిగిన పనులకు సంబంధించి రికార్డులను పరిశీలించామన్నారు. అన్ని రికార్డులను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఈఓఆర్డీ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేపలమార్కెట్‌ను శుభ్రం చేయాలని వినతి

తాడిపత్రి, మే29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న చేపలమార్కెట్ చెత్తాచెదారంతో నిండిపోయిందని, దాని నుంచి వచ్చే దుర్వాసన భరించలేకున్నామని, వెంటనే శుభ్రం చేయించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకుడు రంగనాథరెడ్డి మాట్లాడుతూ చేపలమార్కెట్ పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాటు పందుల స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. అక్కడి నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకున్నామన్నారు. వెంటనే శుభ్రం చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు అంజనేయులు, చెన్నా రంగనాయకులు, ఓబులేరెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుళ్లాయిస్వామి (60) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం ఆయన రోడ్డు దాటు తుండగా ప్రమాదవశాత్తు ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడగా స్థానికులు అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పాముకాటుతో మహిళా రైతు..

బెళుగుప్ప, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకంపల్లిలో గురువారం మహిళారైతు పాముకాటుతో మృతి చెందింది. గ్రామానికి చెందిన పాటిల్ ప్రభాకర్‌రెడ్డి భార్య, మహిళా రైతు అయిన సావిత్రమ్మ (60) గ్రామశివారులో ఉన్న తోటలో పశువుల మేత కోసం వెళ్లింది. అక్కడ గడ్డి కోస్తుండగా పాటు కాటు వేసింది. విషయం కుటుంబ సభ్యులకు తెలపగా వెంటనే వారు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు భర్త తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు సంతానం. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు..


రాజకుళ్లాయప్ప (ఫైల్)

పుట్లూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన రాజకుళ్లాయప్ప (26) అనే యువకుడు గురువారం రాత్రి విద్యుతాఘాతంతో మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ లైన్ తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి ఎంతసేపటికీ రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. స్పందన లేకపోవడంతో పొలం వద్దకు వచ్చిచూడగా నిర్జీవంగా పడి ఉన్నాడు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి సరస్వతి బోరున విలపించింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని తండ్రి గతంలోనే మరణించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లి తల్లడిల్లిపోయింది.

భూమిని పరిశీలించిన ఆర్డీఓ

యాడికి, మే29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయభూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు వచ్చిన దరఖాస్తు మేరకు మండలంలోని రాయలచెరువు గ్రామంలో గల భూమిని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. రాయలచెరువు గ్రామానికి చెందిన మదమంచి శివప్రసాద్ అనేరైతు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. రాయలచెరువు గ్రామపరిధిలోని ఎల్‌పీఎం నెంబర్ 1475, 1480లలో ఉన్న భూమిని ఆర్డీఓ పరిశీలించారు. భూమి విస్తీర్ణం, సదరు భూమికి రస్తా తదితర వివరాలను ఆరాతీశారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, వీఆర్వో కుమారస్వామి, విలేజ్ సర్వేయర్ భార్గవ్ పాల్గొన్నారు.

సురక్షిత గోడౌన్లలోనే రేషన్‌ను భద్రపరచండి

పామిడి, మే 29 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే నిత్యావసర సరుకులను సురక్షితమైన గోడౌన్లలోనే భద్రపరచాలని తహసీల్దార్ శ్రీధరమూర్తి, సీఎస్‌డీటీ కంబక్క సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వారు డీలర్లతో సమీక్షించారు. జూన్ నెలలో మూడు మాసాల నిత్యావసర సరుకులను ఒకే సారి అందజేయాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలం కావడంతో ప్రజలకు నిత్యావసర సరుకులు తీసుకువెళ్లడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఒకే సారి ఇచ్చేలా కేంద్రం ఆదేశించిందన్నారు. డీలర్లు వర్షానికి నిత్యావసర సరుకులు తడిసిపోయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. రీసర్వే డీటీ విజయ్, వీఆర్వోలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో తూనికల యంత్రాల పరిశీలన


బెళుగుప్పలోని ఓ రేషన్ షాపులో తూనికల యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

బెళుగుప్ప, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని రేషన్ షాపు ల్లో తూనికలు, కొలతల యంత్రాలను లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం పరిశీలించా రు. అనంతపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ప్రభుత్వ రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను ఎండీయూ ద్వారా పంపిణీ చేయకుండా నేరుగా డిపోల నుంచి అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందు లో భాగంగా ఈ పాస్ మిషన్, తూనికల యంత్రం ఎలా పని చేస్తున్నా యో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ నెలాఖరు వరకు అన్ని మండలాల్లో గల రేషన్ షాపుల్లో తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కుందుర్పి: మండలకేంద్రంలోని రేషన్ షాపుల్లో తూనికలు, కొలతల యంత్రాలను లీగల్ మెట్రాలజీ అధికారులు పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ మురళి, టెక్నీషియన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

రాయదుర్గంరూరల్ : పట్టణంలోని నేతాజీరోడ్డులో గల రెండు రేషన్ షాపులను తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. అక్కడ సరుకుల వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డు దారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ అందించాలని సూచించారు. బియ్యం నిలువ వివరాలు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

పుట్లూరు: మండలంలోని పుట్లూరు, బాలాపురం గ్రామాల్లోని రేషన్ షాపులను తహశీల్దార్ శేషారెడ్డి తనిఖీచేశారు. ఈ సందర్భంగా షాపుల్లో మిగులు, కొరత వచ్చిన సరుకులను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్వో నరేంద్ర, సిబ్బంది ఉన్నారు.

తుది దశకు తాగునీటి పైపులైన్ పనులు

- హంద్రీనీవా కాలువపై ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు పూర్తి
- తీరనున్న ఉరవకొండ ప్రజల తాగునీటి కష్టాలు


పైపులైన్ కోసం హంద్రీనీవా కాలువపై ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జి

ఉరవకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ పట్టణానికి రూ.16కోట్ల వ్యయంతో చేపట్టిన తాగునీటి పథకం పైపులైన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్నికల సమయంలో మంత్రి కేశవ్ ఇచ్చిన హామీ మేరకు తాగునీటి పథకం పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఉరవకొండలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు అందించాలన్న లక్ష్యంతో మంత్రి కేశవ్ పైపులైన్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. జలజీవన్ మిషన్ కింద రూ.16.5 కోట్లతో 17కిలో మీటర్ల మేరకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. హంద్రీనీవా కాలువపై పైపులైన్ నిర్మాణం కోసం ఐరన్‌బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. బ్రిడ్జి ద్వారా అటు వైపు పైపులైన్ నిర్మాణం చేపట్టి కనెక్షన్ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ప్రాంగణంలో నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యంతో చేపట్టిన సంపు నిర్మాణం పూర్తయింది. ఉరవకొండ ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా చేయడమే లక్ష్యంగా నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పైప్‌లైన్ అందుబాటులోకి వస్తే అదనంగా 20 లక్షల లీటర్ల నీరు సరఫరా కానున్నది. పైపులైన్ నిర్మాణంలో భాగంగా ముష్టూరు క్రాస్ వద్ద రోడ్డు కటింగ్ చేపట్టి, పైపులను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ప్రాంగణంలో నీటి సరఫరా కావడానికి మోటార్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. మోటార్లు ఉంచడానికి ప్రత్యేక గదిని నిర్మిస్తున్నారు. ఈ విషయంపై డీఈ షఫీన్‌ను వివరణ కోరగా.. మోటార్ల ఏర్పాటుకు గదిని నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


కూడేరులోని ఎన్‌సీసీ క్యాంప్‌లో యోగా చేస్తున్న కేడెట్లు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని పలువురు అధికారులు సూచించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో గురువారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు శాఖల అధికారులు యోగాపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ల చేత సిబ్బందితో, ప్రజలతో యోగాసనాలను వేయించారు. అనంతరం మాట్లాడుతూ.. యోగాతోనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు యోగాపై శిక్షణ

కూడేరు: మండలకేంద్రంలోని ఎన్‌సీసీ క్యాంపులోగల ఎన్‌సీసీ కేడెట్లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. 6వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ కులకర్ణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాడేను పురస్కరించుకుని కేడెట్లకు నెల పాటు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఐటీడీపీ కార్యకర్తలపై కేసుల కొట్టివేత

రాయదుర్గం, మే29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఐటీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు గురువారం కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై అప్పట్లో గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన తిప్పేస్వామి, పరమేశ్వర, కిందింటి హరినాథ్ సోషల్ మీడియాలో పోస్టులు పెటారు. దీంతో వారిపై వైసీపీ నేతలు గుమ్మఘట్ట పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేయించారు. దీనిపై జైలుకు కూడా పంపించారు. అప్పట్లో హాట్‌టాపిక్‌గా నడిచిన ఈ కేసులకు సరైన ఆధారాలు లేవని కోర్టు కొట్టివేసింది. దీంతో ఐటీడీపీ కార్యకర్తలు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొరవతో న్యాయ పోరాటం చేసి గెలిచామని తెలిపారు.

బాల్య వివాహ యత్నం

- అడ్డుకున్న అధికారులు

కణేకల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామంలో బాల్య వివాహం జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. గురువారం అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. హనుమాపురానికి చెందిన 13 ఏళ్ల బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాలని ప్రయత్నాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సల్మా, కానిస్టేబుల్ రామాంజినేయులు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్లి బాల్య వివాహం చేయరాదని సూచించారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమించి చేస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాచిగూడ - మధురై రైలును పునరుద్ధరించాలని వినతి

తాడిపత్రి, మే29(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడ- మధురై రైలును పునరుద్ధరించాలని హిందూచైతన్యవేదిక నాయకులు గురువారం రైల్వే అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మధురై రైలును రద్దు చేయడం వల్ల అరుణాచలం వెళ్లే హైందవ భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు పలు రైళ్లు తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో ఆపడం లేదని, దీనిపై కూడా దృష్టి సారించి రైళ్లు ఆపాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మధు, శేషఫణి, శ్రీధర్ ఉన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

పెద్దపప్పూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మలదిన్నె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో 1987 - 1992 విద్యా సంవత్సరాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్ల ఒకచోట కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు.

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి సమావేశం

గుంతకల్లు, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీయూడబ్ల్యూజే కార్యాలయంలో గురువారం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సమితి (ఓపీడీఆర్) సమావేశం జరిగింది. ఇందులో ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాంకుమార్ పాల్గొని మాట్లాడారు. అడవుల్లో నివశించే గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న ఉద్యమకారులను ప్రభుత్వాలు కుట్రదారులంటూ, మావోయిస్టులంటూ బూటకపు ఎన్‌కౌంటర్లతో జీవించే హక్కును కాలరాస్తున్నాయన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేయడమే కాకుండా, కనీసం వారి మృతదేహాలను సైతం కుటుంబీకులకు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. మృతదేహాలను అప్పగించాలని మృతుల కుటుంబ సభ్యులు హైకోర్టుకు వెళ్లి అభ్యర్థించినా సామూహిక దహనం చేయడం అత్యంత హేయమన్నారు. చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపినా పెడచెవిన పెడుతున్నారని, లక్షల కోట్ల ఖనిజ సంపదను కొల్లగొట్టడం కోసమే ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు బీ. సురేశ్, గుంతకల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ. జయరాం, సంయుక్త కార్యదర్శి బీ. తిమ్మప్ప, ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు వీ .నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతి

పెద్దవడుగూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రాజేశ్వరి (18) అనే యువతి కుటుంబ కలహాలతో మూడురోజులక్రితం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం కుదుటపడడంతో బుధవారం రాత్రి ఇంటికి పిలుపుకొచ్చారు. అయితే అర్ధరాత్రి సమయంలో మరోసారి ఆరోగ్య పరిస్థితి విషమించింది. అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, మే29(ఆంధ్రజ్యోతి) మండలంలోని కలుదేవనహళ్లి గ్రామ శివారులో ఓ సపోట తోటలో పేకాట కేంద్రంపై గురువారం పోలీసులు దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6770 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు చెప్పారు.

నాటుసారా స్వాధీనం

గుంతకల్లుటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణ సరిహద్దులోని పత్తికొండ రహదారిలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి వంద లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయా జిల్లాల సరిహద్దు ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఇందులో 4వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, వంద లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అనంతపురం జిల్లా ఏఈఎస్ శ్రీరామ్, సీఐలు అన్నపూర్ణ, జయంత్‌రెడ్డి, శివసాగర్, ఎస్‌ఐలు సుశీలమ్మ, ఉమాదేవి, కర్నూలు జిల్లా ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్, సీఐలు రాజేంద్రప్రసాద్, పత్తికొండ సీఐ విశ్వేశ్వర రావు, ఎస్‌ఐ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంపై కాలవ సీరియస్

రాయదుర్గం, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం రాత్రంతా విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. మహానాడులో ఉన్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు విషయం తెలియడంతో గురువారం ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి సీరియస్ అయ్యారు. అనంతరం ఆయన ఆదేశాల మేరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు సంపత్‌కుమారి, మాజీ కౌన్సిలర్ టంకశాల హనుమంతు ఆస్పత్రికి చేరుకుని విద్యుత్ సమస్యకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించారు. ప్యానల్‌బోర్డు ఏర్పాటు, కనీస మెయింటెనెన్స్ లేకపోవడంతోనే సమస్య తలెత్తినట్లు నిర్ధారించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరెడ్డితో చర్చించి విద్యుత్ సమస్య తలెత్తకుండా తాత్కాలిక చర్యలు చేపట్టి పరిష్కారం చేశారు. 15 రోజుల్లో శాశ్వతంగా సమస్యను పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ స్పష్టం చేశారు.

మహానాడుకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

గుత్తి, మే 29(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు సభకు గురువారం మండలంలోని టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి సైతం నాయకులు, కార్యకర్తలు పలు వాహనాలు సమకూర్చుకుని బయలుదేరి వెళ్లారు. నాయకులు అబ్దుల్ వహబ్, సోమశేఖర్, చెన్నకేశవులు, ఇలియాజ్, వీరన్న, కుళ్లాయప్ప, దిల్కాశీనా, ఈశ్వరయ్య, తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

● గుంతకల్లుటౌన్: టీడీపీ మహానాడుకు టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు టీ కేశప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తరలివెళ్లారు.

● పామిడి: మండలం నుంచి టీడీపీ శ్రేణులు మహానాడు సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తొలుత మండలకేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక వాహనాలలో కడపకు బయలుదేరి వెళ్లారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్న గారి కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ ఇతర నాయకులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

● యాడికి: టీడీపీ మహానాడుకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మహానాడుకు వెళ్లే బస్సులను మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడులు జెండా ఊపి ప్రారంభించారు.

● పుట్లూరు: మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ మహానాడు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివెళ్లారు. తొలుత మండలకేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలు వాహనాల్లో కడపకు బయలుదేరి వెళ్లారు. నాయకులు బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, శ్రీనివాస్‌నాయుడు, కులశేఖర్‌రెడ్డి, గోవర్దన్‌రాజు, వేణు, రవీంద్రచౌదరి, రవికుమార్‌రెడ్డి, రామచంద్రరెడ్డి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

● బొమ్మనహాళ్: మండలం నుంచి టీడీపీ శ్రేణులు మహానాడుకు భారీగా తరలివెళ్లారు. 15పైగా వాహనాల్లో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, నాయకులు పయ్యావుల మోహన్, పయ్యావుల అనిల్, నవీన్, సంగప్ప, సైకిల్ షాప్ హనుమంత తదితరులు తరలిన వారిలో ఉన్నారు.

● పెద్దపప్పూరు: మండలకేంద్రంతో పాటు ప్రతి గ్రామం నుంచి టీడీపీ శ్రేణులు మహానాడుకు తరలివెళ్లారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, ఇతర నాయకులు వెళ్లిన వారిలో ఉన్నారు.



యాడికి, గుత్తి నుంచి మహానాడుకు బయలుదేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మహానాడులో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

- సీఎం చంద్రబాబుకు జ్ఞాపిక అందజేత
- పలువురు మంత్రులతో భేటీ


సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

తాడిపత్రి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో మూడవరోజైన గురువారం జరిగిన టీడీపీ మహానాడుకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పట్టణంలోని తమ నివాసం నుంచి భారీ కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లారు. అనంతరం అక్కడ వారు సీఎం చంద్రబాబును కలిసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలిసి సత్కరించారు. అలాగే మంత్రులు అచ్చెంనాయుడు, కొల్లురవీంద్ర, సవిత, అనిత, బీసీ జనార్ధన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి తదితరులను కలిసి పలు విషయాలపై చర్చించారు.

కళ్యాణదుర్గంలో టీడీపీ పనితీరు భేష్..

- మహానాడులో సీఎం చంద్రబాబు ప్రశంసలు
- లక్ష సభ్యత్వాలు నమోదు చేయించడంతో ఎమ్మెల్యే అమిలినేనికి అభినందనలు


ఎమ్మెల్యే అమిలినేనిని శాలువాతో సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు

కళ్యాణదుర్గం, మే29 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ పనితీరు బేషుగ్గా ఉందని, ఇందుకు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో లక్షకు పైబడి పార్టీ సభ్యత్వాలు చేయించడమే నిదర్శనమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఇందుకు గాను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును అభినందించారు. కడపలో గురువారం నిర్వహించిన మహానాడులో ఎమ్మెల్యే అమిలినేనిని సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అభినందిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా వుంటూ టీడీపీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రేపే పింఛన్ల పంపిణీ

రాయదుర్గంరూరల్/ డీ. హీరేహాళ్/ శెట్టూరు, మే 29(ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీన పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగానే అనగా ఈ నెల 31వ తేదీ శనివారం పంపిణీ చేయనున్నట్లు రాయదుర్గం, డీ.హీరేహాళ్, శెట్టూరు మండలాల ఎంపీడీఓలు కొండన్న, దాస్‌నాయక్, జిలాన్‌బాషా గురువారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో శనివారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు గ్రామాలలో అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆ నలుగురు సేవాసమితికి విరాళం

గుంతకల్లుటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆ నలుగురు సేవా సమితికి రూ.50 వేల విరాళాన్ని పట్టణానికి చెందిన గణాచారి బాబు రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నలుగురు సేవా సమితి సేవా కార్యక్రమాలను విసృత్తంగా చేపడుతున్న నేపథ్యంలో తమ వంతుగా ఆర్థిక సాయాన్ని ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్‌కు అందజేశామన్నారు. సమితి ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు పురుషోత్తం పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి: సీపీఐ

రాయదుర్గంరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019కి ముందు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. లబ్ధిదారులు అద్దె ఇళ్లలో ఉండలేక, ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తేజ, వీరేంద్ర, నవీన్, ప్రతాప్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

బొమ్మనహాళ్, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఓ ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతైంది. గ్రామంలో నివాసముంటున్న వన్నూరువలి తన ద్విచక్ర వాహనాన్ని బుధవారం రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేశాడు. కాగా గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పుపెట్టారు. దీంతో వాహనం సీటు, పెట్రోల్ ట్యాంక్ కవర్, వైర్లు కాలిబూడిదయ్యాయి. స్థానికులు మంటలు గమనించి వెంటనే ఆర్పేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.